

ఎపిజిగా అప్పాజీ నియామకం


అప్పాజీ

ప్రజాశక్తి - తణుకు

అసిస్టెంట్ గవర్నమెంట్ అడ్వకేట్ (ఎజిపి)గా తణుకు కోర్టుకు తనను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందజేసిందని శనివారం ఒక ప్రకటనలో గాజుల వీర వెంకట అప్పాజీ తెలిపారు. తాను 2005 నుంచి న్యాయవాదిగా తణుకు కోర్టులో పనిచేస్తున్నానని తెలిపారు. తణుకు నియోజకవర్గం, నిడదవోలు నియోజకవర్గం, ఉండ్రాజవరం, పెరవలి పరిధిలోని ప్రభుత్వ కేసులను వాదించనున్నట్లు తెలిపారు. అప్పాజీ నియామకం పట్ల తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి, తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం జోరు

అధికారం అండగా ముందుకు సాగుతున్న కూటమి అభ్యర్థి

సమస్యల పరిష్కారానికి స్పష్టమైన డిమాండ్లతో పిడిఎఫ్ ప్రచారం

ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నుంచి పెరుగుతున్న మద్దతు


పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు తరపున ఎంఎల్‌సిలు ఐవి, గోపీమూర్తి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

శాసన మండలి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానానికి ప్రచారం జోరందుకుంది. ఈ ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇద్దరు అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ ఉందని పరిశీలకుల అంచనా. అధికార టిడిపికి చెందిన పేరాబత్తుల రాజశేఖరం, పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు (డి.వి.రాఘవులు) మధ్య పోటీ హోరాహోరీగా సాగుతోంది. పిడిఎఫ్‌కు మంచి పట్టు ఉన్న ఈ స్థానంలో ఎలాగైనా ఈ సారి గెలుపొందాలని ఓటర్ల నమోదు దగ్గర నుంచి టిడిపి ప్రత్యేక దృష్టి సారించింది. అలాగే మంత్రులు, ఎంఎల్ఎలకు ప్రధాన బాధ్యతలు అప్పగించింది. మండలస్థాయి నేతలను సైతం రంగంలోకి దింపి ప్రచారం సాగిస్తోంది. అయితే అధికార దర్పం మినహా ప్రచారంలో గ్రాడ్యుయేట్లకు చేసిందేమిటీ, చేసేదేమిటీ అనే అంశాలేవీ లేకపోవడం చర్చనీయాంశమవుతోంది. ఇప్పటికే కూటమి అధికారంలోకి రాగానే డిఎస్‌సి ఫైల్‌పైనే తొలి సంతకం అని పెట్టినా ఇప్పటికీ నోటిఫికేషన్ కూడా వెలువడలేదు. వివిధ కారణాలు చెప్పి వాయిదా వేసుకుంటూ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలు దాటుతున్నా డిఎస్‌సిపై స్పష్టత రాకపోవడం ఆ అభ్యర్థుల్లో నిరాశ నెలకొందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇక మిగిలిన ఖాళీల భర్తీ సంగతి తెలియంది కాదు. అదే సమయంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ఎటువంటి తీపి కబురూ లేదు. సరికదా వేతనాలు ఆలస్యమవుతున్నాయనే ఆవేదన వారిలో బలంగా ఉంది. తాజాగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఖాళీల భర్తీ ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలనే నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత కన్పిస్తోంది. ఇక నిరుద్యోగ భృతి ఊసేలేదు. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి క్రిస్మస్, సంక్రాంతి సందర్భంగా డిఎల విడుదలపై హడావుడీ చేసినా కనీస ప్రస్తావన లేకపోవడం వారిని నిరాశకు గురి చేసింది. ఈ క్రమంలో అధికారం చేపట్టి ఎనిమిది నెలలైనా చిన్నపాటి అంశాల పరిష్కారం చేపట్టని కూటమి ప్రభుత్వంపై ఆయా తరగతుల ఉద్యోగులు, ప్రజలు అసంతృప్తితో ఉన్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అయితే కూటమి అభ్యర్థి ప్రధానంగా అధికారమే అండగా గెలిచే ప్రయత్నాల్లో ఉన్నారనేది బహిరంగ రహస్యం.

ఇక పిడిఎఫ్ ఈ స్థానంలో తొలి ఎన్నికల్లోనే విజయబావుటా ఎగరేసింది. నాడు కచ్చా జార్జి విక్టర్ ఎంఎల్‌సిగా అందించిన సేవలు గ్రాడ్యుయేట్లకు చిరస్మరణీయమే. తర్వాత ఎన్నికల్లో కార్పొరేట్ అభ్యర్థుల హవా సాగినా గత ఎన్నికల్లో ఉద్యమాల నేత ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) విజయకేతనం ఎగురవేశారు. నాటి నుంచి నేటి వరకూ శాసనమండలిలో ఆయా తరగతుల ప్రజల సమస్యలపై ప్రశ్నించడమే కాకుండా ప్రజా ఉద్యమాలకు మద్దతుగా ప్రత్యక్ష ఉద్యమాల్లో సైతం పాల్గొని నిర్బంధానికి సైతం గురయ్యారు. టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో షేక్ సాబ్జీ, తర్వాత ఉప ఎన్నికల్లో బొర్రా గోపీమూర్తి పిడిఎఫ్ తరపున గెలుపొందిన సంగతి తెలిసిందే. ప్రధానంగా పిడిఎఫ్ అంటే ఉద్యోగ, కార్మిక, ప్రజల గొంతుకగా పేరొందడమే కాకుండా ఆయా తరగతుల ప్రజల పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం, నిరాడంబరత అందరినీ ఆకర్షిస్తోంది. ఆయా ప్రజా ఉద్యమాలకు నేతృత్వం వహించే సంఘాలన్నీ గతంలో వలే పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు తరపున గ్రాడ్యుయేట్ ఓటర్లను నేరుగా కలుస్తూ ప్రచారం సాగిస్తున్నాయి. అదే సమయంలో సమస్యల పరిష్కారానికి తమ డిమాండ్లేమిటి అనేది కూడా ఆయా గ్రాడ్యుయేట్ల ముందుంచడం వారిని ఆలోచింపజేస్తోంది. అధికార దర్పంగా కాకుండా సామాన్యుడి ప్రచారం విధానాలు, అంశాల ప్రాతిపదికన సాగుతుండటం విద్యావంతుల్లో చర్చనీయాంశం అవుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అయితే విధానాలు, డిమాండ్లతో కూడిన ప్రచారంతో ముందుకు సాగుతున్న పిడిఎఫ్ అభ్యర్థి అయిన సామాన్యుడికి పట్టం కడతారో, కూటమి అభ్యర్థి అధికారానికే అనుకూలంగా ఉంటారో వేచిచూడాలి.

పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులును గెలిపించాలి



గణపవరం : రాఘవులును గెలిపించాలని ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆచంట

నిస్వార్థ ప్రజా సేవకుడు, నిబద్ధత గల నాయకుడు పిడిఎఫ్ బలపర్చిన ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులను మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలని కోరుతూ శనివారం మండలంలోని కరుగోరుమిల్లి, వేమవరం గ్రామాల్లో ప్రజా సంఘాలు, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎస్.శర్మ మాట్లాడుతూ మేధావుల సభకు మేధావులను పంపించడం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దిడ్ల వీర రాఘవులును గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పట్టభద్రుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులు మాత్రమే నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. దిడ్ల వీర రాఘవులును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేత పి.మోహన్‌రావు, సిఐటియు నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, కొండేటి సత్యనారాయణ, గుత్తుల రంగారావు సిర్రా విఘ్నేశ్వరుడు, ఎకెవి.సత్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వీరవాసరం :పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును చట్టసభకు పంపాలంటూ సిఐటియు, ప్రజాసంఘాలు కోరాయి. శనివారం సిఐటియు, ప్రజా సంఘాల బృందం పిడిఎఫ్ అభ్యర్థి వీర రాఘవులను గెలిపించాలంటూ ఉత్తరపాలెం, కొణితివాడలో ప్రచారం నిర్వహించారు. 40 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి నేడు ప్రజల కోసం శాసనమండలి ఎన్నికల్లో వీర రాఘవులు పోటీ చేస్తున్నారని తెలిపారు. ఆయనను ఎందుకు గెలిపించాలో ప్రచారం బృందం ఓటర్లకు వివరించారు. ఈ ప్రచారంలో రైతు సంఘం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, బాలం విజయకుమార్, పోతుల మృత్యుంజయ, కేతా జ్యోతిబసు పాల్గొన్నారు.

గణపవరం : పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో యుటిఎఫ్, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గణపవరం, పిప్పర, కేశవరం గ్రామాల్లో ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు, వ్యకాస మండల కార్యదర్శి నరాలశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, కర్షకుల గొంతు పెద్దల సభలో లేవనెత్తే పిడిఎఫ్ అభ్యర్థి వీర రాఘవులకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో వీర రాఘవులు గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామాల్లోని పలు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని ఓటు ఉన్న ఒక్కరినీ కలిసి ఓట్లు అభ్యర్థించారు.


ఉత్తరపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

కోళ్ల ఫారాల్లో అపరిశుభ్రతే పెద్ద సమస్య

పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు ఆదేశం

రాష్ట్ర పశుసంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్

ప్రజాశక్తి - తణుకు రూరల్

కోళ్ల ఫారమ్‌లో అపరిశుభ్రత పెద్ద సమస్యగా ఉందని, పరిశుభ్రతపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ తెలిపారు. శనివారం అధికారి రాజశేఖర్ తొలుత ఉంగుటూరు మండలం బాదంపూడి పౌల్ట్రీ షెడ్లను పరిశీలించారు. అనంతరం తణుకు మండలం వేల్పూరు జి.కృష్ణానందం పౌల్ట్రీ షెడ్లను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదరనాయుడు, జిల్లా కలెక్టర్ నాగరాణితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పశుసంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ కోళ్ల ఫారమ్స్‌లో అపరిశుభ్రత అతిపెద్ద సమస్యగా ఉందన్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ సమాచారం మొట్టమొదటి బాదంపూడి కోళ్ల ఫారమ్ నుంచి అందిందన్నారు. దీనికి కారణం పౌల్ట్రీ లిట్టర్ అన్నారు. పౌల్ట్రీలో కోళ్ల విసర్జన, చిందిన ఫీడ్, ఈకలు మిశ్రమం షెడ్ల కిందకు చేరడంతో కొంగలు వంటి పక్షులు ఆకర్షణకులోనై అవి ఇతర ప్రాంతాలకు వైరస్ వాహకాలుగా ఉంటాయని తెలిపారు. వాటితోపాటు పౌల్ట్రీలో వర్కర్స్ అటు ఇటు తిరగడం ద్వారా కూడా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. నిర్ణీత గడువులోపు శుభ్రం చేయించాల్సి ఉంటుందన్నారు. పరీక్షల్లో వైరస్ రుజువైన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొంతమంది పౌల్ట్రీ యజమానులు వైరస్ తగ్గుతుందిలే అని దాచి ఉంచడం కూడా ఇంత ఎక్కువగా వైరస్ వ్యాప్తి చెందడానికి కారణమన్నారు. వైరస్ సోకిన షెడ్లలో కోళ్లను నూరు శాతం కల్లింగ్ చేసినట్లు తెలిపారు. ఈ షెడ్లను మూడు నెలల పాటు మూసి ఉంచడం జరుగుతుందని, తనిఖీలు చేసి సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాతే మళ్లీ పౌల్ట్రీ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో మూడు నెలల వరకూ లోపలికి, బయటకు వెళ్లడాన్ని నిషేధించడం జరిగిందన్నారు. రెడ్‌జోన్‌లో మినహా మిగతా ప్రాంతాల్లో కోడి మాంసం, గుడ్లు బాగా ఉడికించి నిరభ్యంతరంగా వినియోగించవచ్చని స్పష్టం చేశారు. నాలుగు జిల్లాల్లో ఐదు ఫారాల్లో కోళ్ళు, గ్రుడ్లు కల్లింగ్ చర్యలు పూర్తి చేసినట్లు తెలిపారు. 50 వేల గుడ్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన షెడ్లను పశుసంవర్ధక శాఖ అధికారులు 15 రోజులకోసారి తనిఖీ చేయడానికి ఆదేశించినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం వైరస్ నెమ్మదించిందని, వాతావరణంలో వేడి పెరగడంతో వైరస్ ఇబ్బంది తొలుగుతుందని తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదరనాయుడు, కలెక్టర్ నాగరాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ ఉన్నారు.



కోళ్ల ఫారాన్ని పరిశీలించి మాట్లాడుతున్న రాజశేఖర్

ఎందుకింత నిర్లక్ష్యం..!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాను బర్డ్‌ఫ్లూ భయం బెంబేలెత్తిస్తోంది. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లఫారాలు ఒకొక్కటీ వెలుగులోకి వస్తుండడంతో జనం ఉలిక్కిపడుతున్నారు. ఇక ఎంఎల్‌సి ఎన్నికల ప్రచార హోరు ప్రారంభమైంది. ఈ పోరులో తలపడే అభ్యర్థుల జాబితా సిద్ధం కావడంతో అంతా ప్రచారంపై దృష్టి సారించారు. ఐక్య పోరాటాలతోనే ఎవరినైనా కదిలించగలమని ఆదివాసీ గిరిజనులు మరోసారి రుజువు చేశారు. 1/70 చట్ట సవరణ యోచన లేదని సిఎం చంద్రబాబు ప్రకటించాల్సి రావడమే దీనికి నిదర్శనం.

బర్డ్‌ఫ్లూ కలకలం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరులో ప్రారంభమై పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు వ్యాపించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు మండలం వేల్పూరులోని ఒక పౌల్ట్రీలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు కలెక్టర్ అధికారికంగా ప్రకటించారు. ఆ పౌల్ట్రీకి కిలోమీటర్ మేర రెడ్‌జోన్, పది కిలోమీటర్ల మేర సర్వేలైన్స్ జోన్‌గా ప్రకటించారు. రెడ్‌జోన్ అనగానే కరోనా నాటి పరిస్థితులు గుర్తొచ్చి జనం ఒకింత ఆందోళనకు గురయ్యారు. అయితే అంత కఠిన పరిస్థితులు లేకపోవడంతో ఒకింత ఊరట చెందారు. ఆ తర్వాత ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం బాదంపూడిలోనూ కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారించి నివారణా చర్యలు చేపట్టారు. రెండు చోట్లా కోళ్ల ఖననం, డిస్‌ఇన్ఫెక్ట్ చేసేందుకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను రంగంలోకి దింపారు. ఇంతవరకూ బాగానే ఉంది. అసలు బర్డ్‌ఫ్లూ నిర్ధారణకు ఎందుకింత ఆలస్యమైందనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. గత డిసెంబర్ నుంచే కోళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడటం అందరికీ తెలిసిందే. తొలుత నాటుకోళ్లు పెద్దసంఖ్యలో మృత్యువాత పడ్డాయి. దాని ప్రభావం సంక్రాంతి సంప్రదాయం ముసుగులో జరిగే కోడి పందేలపైనా కన్పించింది. సరైన పుంజులు లేక ఉన్న పుంజులతో సాగిన పందేల్లోనే పెద్దఎత్తున నగదు చేతులు మారింది. ఆ తర్వాత బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడటం ప్రారంభమైంది. అప్పటికీ జిల్లాలోని పశుసంవర్ధక శాఖాధికారులుగానీ, జిల్లా ఉన్నతాధికారులుగానీ అటువైపు పరిశీలించిన దాఖలాల్లేవు. ఉమ్మడి జిల్లాలో సుమారు రెండు లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాక అధికార యంత్రాంగం కదిలి దృష్టి సారించగా బర్డ్‌ఫ్లూ నిర్ధారైంది. అప్పటికే కోళ్ల మృత్యువాతతో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన పౌల్ట్రీ రైతులకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ గోరుచుట్టుపై రోకలిపోటులా పరిణమించింది. ఈ క్రమంలో అధికారుల ప్రకటనలు పౌల్ట్రీ రంగాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి.



కోడిగుడ్లు, మాంసం వాడరాదని సాగిన ప్రచారంతో అమ్మకాలు ఒక్కసారిగా పడిపోయాయి. అదే సమయంలో ఇతర ప్రాంతాలకు ఎగుమతులు సైతం నిలిచిపోయాయి. దీంతో పౌల్ట్రీ రైతులు ఫారాలు వదిలి బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. రెడ్‌జోన్ పరిధిలో మూడు నెలల వరకూ కోళ్లఫారాలు తెరిచే అవకాశం లేదు. అంటే జూన్ వరకూ కోళ్లఫారాల జోలికెళ్లే పరిస్థితి లేదు. ఈ లోపు ఆ పరిధిలో ఇంకేమైనా కేసులు వెలుగుచూస్తే మరింత జాప్యం తప్పనిసరి. ఈ నేపథ్యంలో పౌల్ట్రీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే సమయంలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో కోడిమాంసం, గుడ్లు వాడొచ్చా.. వాడొచ్చంటే ఎలా వాడాలి, లేదంటే ఎప్పటి వరకూ ఏ పరిధిలో వారు వాటి జోలికెళ్లకూడదు అనే అంశాలను ప్రభుత్వం విస్తృత ప్రచారం చేయాలి. అలాగే కోళ్లు డిసెంబర్ నుంచే మృత్యువాత పడుతున్నా సంబంధిత అధికారులు ఏం చేశారు.. ఎందుకు ముందస్తు చర్యలు చేపట్టలేదనే దానిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని అటు పౌల్ట్రీ రైతులు, ఇటు జనం కోరుతున్నారు.

ఇక ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం షురూ అయ్యింది. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి కోడ్ అమలులో రెండు జిల్లాల అధికారులు, సిబ్బంది తడబడుతూనే ఉన్నారు. పోనీ మొదట్లో ఒకింత అలసత్వం వహించినా నామినేషన్ల పర్వంలోనూ అదే నిర్లక్ష్యం కొనసాగడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రధానంగా కూటమి అభ్యర్థి నామినేషన్ సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరు అందరినీ ఆలోచింపజేసింది. అధికార పార్టీ అభ్యర్థికి ఒక నిబంధనలు, ఇతర అభ్యర్థులకు వేరే నిబంధనలు ఉంటాయా అనే అనుమానాలు తలెత్తాయి. ఇదే కాదు గ్రామీణ, పట్టణ స్థాయిలో అధికార పార్టీ ప్రచార ఫ్లెక్సీల తొలగింపులోనూ ఇదే నిర్లక్ష్యం కన్పించింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోడ్ పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాజ్యాంగ, ప్రభుత్వ పదవుల్లో ఉన్నవారు మాట్లాడే ప్రతి మాట వెనుకా కచ్చితంగా అంతరార్థం వేరే ఉంటుందనేది అందరికీ తెలిసిందే. ఈ తరహాలోనే విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు ఆదివాసీ గిరిజనులను తీవ్ర వేదనకు గురి చేశాయి. పర్యాటక రంగ అభివృద్ధి పేరిట గిరిజనుల హక్కులను కాలరాస్తామనడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరును కూటమి ప్రభుత్వం తూచా తప్పకుండా పాటిస్తున్నట్లు స్పష్టమవుతోంది. స్పీకర్ వ్యాఖ్యలపై పలువురు అభ్యంతరాలు తెలిపినా కూటమి ప్రభుత్వ పెద్దలు ఎవరూ స్పందించలేదు. దీనిపై ఆదివాసీ గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యాన ఈ నెల 11, 12 తేదీల్లో ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చినా కదలిక లేదు. 11వ తేదీన ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులంతా ఐక్యంగా రోడ్డెక్కి బంద్ విజయవంతం చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి 1/70 చట్ట సవరణ యోచన లేదని ప్రకటించారు. కొందరి దుష్ప్రచారం నమ్మొద్దని పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజన సంఘాలది దుష్ప్రచారమైతే స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చేయడం అబద్ధమా, లేక ప్రభుత్వ యోచనే స్పీకర్ నోటి వెంట వెలువడ్డాక వ్యతిరేకత రావడంతో వెనక్కితగ్గారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ అయ్యన్నపాత్రుడే పొరపాటున మాట్లాడి ఉంటే స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తి ఎందుకింత నిర్లక్ష్యం అనే విమర్శలు విన్పిస్తున్నాయి.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

ప్లాస్టిక్ నిర్మూలనతో కేన్సర్‌ను జయిద్దాం

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్‌లో కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి రెండు, మూడు కుటుంబాల్లో కేన్సర్‌కు ప్లాస్టిక్ ఒక కారణంగా ఉందని, ప్లాస్టిక్ నిర్మూలనతో కేన్సర్‌ను జయిద్దామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం సోర్స్ - రిసోర్స్ అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్లాస్టిక్ మన ఆరోగ్యాన్ని ఎలా కబళిస్తుందో తెలిసి కూడా దాని వైపే మొగ్గు చూపడం అవసరమా అని ప్రశ్నించారు. జిల్లాలో ముఖ్యంగా భీమవరం పరిసర ప్రాంత గ్రామాల్లో ప్రతి రెండు, మూడు కుటుంబాల్లో ఒకరు కేన్సర్ పేషెంట్ కావడానికి ప్లాస్టిక్ కారణంగా ఉందనడంలో ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నారు. ప్లాస్టిక్ కారణంగా గాలి, నీరు, భూమి అన్నీ కలుషితమై ప్రజలు, జంతువులు అనారోగ్యాల పాలు కావడం తెలుస్తూనే ఉందన్నారు. మూడు నెలలుగా భీమవరంలో ప్లాస్టిక్ నిషేధించి పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, వ్యాపారులు ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లలో ఎవరైనా ఏదైనా ఇస్తే తిరస్కరించాలన్నారు. అలాగే వినియోగదారులు సంచులు తీసుకురాకపోతే వస్తువులు అమ్మొద్దని సూచించారు. తొలుత కలెక్టర్ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మహిళలకు గుడ్డ సంచులు, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులను వ్యాపారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, సంఘ సేవకులు కంతేటి రామరాజు, మున్సిపల్ సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎసిపి ఎం.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : ప్లాస్టిక్ మనిషినే తినేసేంతగా విస్తరించిందని, దీని కారణంగా పెద్ద ఎత్తున కేన్సర్ బారిన పడుతున్నారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. చింతపర్రు గ్రామంలో శనివారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా సోర్స్ - రిసోర్స్ కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి పాల్గొని ప్రజలు, వివిధ శాఖల సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే నియంత్రణ సాధ్యం అన్నారు. కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా స్టీల్ వస్తువులు వినియోగిస్తున్నట్లు తెలిపారు. కూరగాయలు, పండ్లు, సరుకులు కొనడానికి తప్పనిసరిగా చేతి సంచిని తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం స్థానికులకు జ్యూట్ బ్యాగులు ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. తొలుత మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు, ఎంపిపి చిత్తూరు కనకమహాలక్ష్మి, తహశీల్దార్ వై.కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌ను ఉపసంహరించుకోవాలి

భీమవరంలో వామపక్షాల ఆధ్వర్యాన నిరసన



భీమవరంలో నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. లేనిపక్షంలో ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించాయి. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ వామపక్షాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనా కార్యక్రమాల్లో భాగంగా శనివారం భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్లో ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ధరలను, నిరుద్యోగ, రైతాంగ ఆత్మహత్యలను పెంచేదిగా ఉందన్నారు. రాష్ట్రపతి తక్షణం జోక్యం చేసుకుని బడ్జెట్‌ను పార్లమెంటుకు తిప్పి పంపాలని డిమాండ్ చేశారు. ఎరువులు, పురుగు మందులు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడానికి బడ్జెట్లో చూపలేదన్నారు. చేతి వృత్తిదారులను దగా చేశారని ఎస్‌సి, ఎస్‌టి, బలహీన వర్గాల సంక్షేమం ఊసే లేదని, ప్రజల భద్రత, సామాజిక న్యాయం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమ ప్రస్తావనలేదని, రుణ విమోచన పథకం ప్రసక్తే లేదని బలరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ బడ్జెట్ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని తెలిపారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అన్నారు. బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయింపులు లేకపోయినా టిడిపి, జనసేన నోరెత్తకపోవడం దారుణమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ పేదలపై భారాలు మోపే బడ్జెట్ అని విమర్శించారు. ప్రజలపై పన్నుల భారం, కార్పొరేట్లకు పన్నుల్లో రాయితీ ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్రం చేసే అప్పులకు హామీ ఉంటానని, కేంద్రం చెబితే కూటమి నాయకులు చంకలు గుద్దుకుంటున్నారని, వీటి వడ్డీలు చెల్లించలేక రాష్ట్రం మరో బీహార్ అవుతుందన్నారు. ఈమేరకు వామపక్షాలు చేసే ఆందోళనలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు, నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎంసిపిఐయు జిల్లా నాయకులు జి.రాంబాబు, పట్టణ కార్యదర్శి కె.మహంకాళి, ఫార్వర్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాస్ రాజు తదితరులు మాట్లాడారు. ఫార్వార్డ్ బ్లాక్ నాయకులు కనుమూరి వెంకటపతిరాజు, దుగ్గిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : మంత్రి


మురుగు డ్రెయిన్‌ను పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

జగన్ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా విధ్వంసానికి గురికాగా నేడు చంద్రబాబు రైతులకు మేలు జరిగేలా అధిక ప్రాధాన్యతిస్తూ గాడిలో పెడుతున్నారని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆగర్తిపాలెంలో శనివారం రూ.1.80 కోట్లతో జరుగుతున్న మొగల్తూరు మురుగు డ్రెయిన్ ప్రక్షాళన పనులను పరిశీలించారు. పనులకు సంబంధించి సంబంధిత శాఖ ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జాప్యం లేకుండా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్ అత్యవసర పనుల నిమిత్తం చంద్రబాబు మంజూరు చేసిన రూ.320 కోట్లతో చేపట్టిన పనులను వచ్చే మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా తాను ఏ జిల్లా వెళ్లినా పంట కాలువలు, మురుగు డ్రెయిన్లు, ప్రాజెక్టులు, రిజర్వాయర్లు ఇలా అన్నీ అడుగడుగునా విధ్వంసంతో కనిపించాయన్నారు. లాకుల గేట్లు, షట్టర్లు, రోప్‌లకు మరమ్మతుల మాట ఎలా ఉన్నా కనీసం గ్రీజు కూడా పెట్టే పరిస్థితి గత ప్రభుత్వంలో లేదన్నారు. గోదావరి ఏటిగట్టు పనులను రూ.15 కోట్లతో చేపట్టినట్లు చెప్పారు. పనులన్నీ సాగునీటి సంఘాల ప్రతినిధులు, రైతుల పర్యవేక్షణలో నాణ్యత పాటించేలా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పాలకొల్లు డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్ పెనుమత్స రామభద్రం రాజు, కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు ఉంగరాల నరసింహారావు, విప్పర్తి చిరంజీవ రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్రంలో విద్యార్థులకు మెరుగైన విద్యనందించి సత్ఫలితాలు సాధించాలని విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు సూచించారు. విద్యాశాఖా మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు క్లస్టర్ వ్యవస్థను తీసుకొచ్చారు. దీనిలో భాగంగా భీమవరం పట్టణ, మండలంలోని హైస్కూళ్లను ఏడు క్లస్టర్లుగా విభజించి శనివారం ఆ క్లస్టర్లలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమరావతి నుంచి కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయరామరాజు వీడియో కాన్ఫరెన్స్‌లో విజయ రామరాజు ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. భీమవరంలో పిఎస్ఎం మున్సిపల్ హైస్కూల్, బివి.రాజు మున్సిపల్ హైస్కూల్, తుందుర్రు హైస్కూల్, అన్నాకోడేరు హైస్కూల్, ఎఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్, జెడ్‌పి హెచ్ హైస్కూల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆయా హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

తడి, పొడి చెత్తపై అవగాహన

గణపవరం : స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గణపవరం పంచాయతీ వద్ద తడిచెత్త, పొడి చెత్త వేరు చేయటంపై స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండలపరిషత్ ఇఒపిఆర్‌డి పి.సత్యనారాయణ, గ్రామ సర్పంచి మూరా అలంకారం షాపు యజమానులకు, స్కూల్ విద్యార్థులకు తడిచెత్త, పొడిచెత్త వేరు చేయటంపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని తెలిపారు. స్థానిక హైస్కూలు వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డివిఎస్‌ఆర్.ప్రసాద్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి ఆధార్ నమోదు

పెనుమంట్ర : మండలంలోని పెనుమంట్ర-1, ఆలమూరు, మార్టేరు-2 పరిధిలోని సచివాలయాల్లో ఈనెల 18 నుంచి 28 వరకు ఆధార్ నమోదు సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఎంపిడిఒ పి.సామ్యూల్ శనివారం ఇక్కడ తెలిపారు. ఈమేరకు జుత్తిగ, భట్లమగుటూరు, ఓడూరుల్లో ఈనెల 18, 19 తేదీల్లో, నత్తారామేశ్వరం, వెలగలవారిపాలెం, సత్యవరం గ్రామాల్లో 20, 21 తేదీల్లో, మాముడూరు మల్లిపూడి, వెలగలేరు గ్రామాల్లో 24, 25 తేదీల్లో, పొలమూరు-1, ఎస్.ఇ.పర్రు, మార్టేరు-1లో 26, 27, 28 తేదీల్లో సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ



నరసాపురం : మండలంలోని లక్ష్మణేశ్వరం సక్కూరాణి పేట(బాలికలు), వేములదీవిలోని(మత్స్యకార బాలుర) మహాత్మా జ్యోతిబాఫూలే ఎపి వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులంలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను 5, 6, 7, 8, 9వ తరగతులలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించినట్లు ప్రిన్సిపల్ సిహెచ్.కె.శైలజ తెలిపారు. ఈమేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 15 నుంచి మార్చి 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్లు, కుల ధ్రువీకరణపత్రం, స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి ఫొటోతో ఆన్‌లైన్ వెబ్‌సైట్లో అప్లై చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు నరసాపురం(బాలికలు)-9866559627, వేములదీవిలోని(మత్స్యకార బాలురు)-91216 15923కు సంప్రదించాలని కోరారు.

18న మండలపరిషత్ సమావేశం

గణపవరం : ఈనెల 18న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని గణపవరం ఎంపిడిఒ ఆర్.దేవీశ్రీ లక్ష్మి శనివారం తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ఈ సమావేశానికి మండల ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

సూర్యారావు మృతదేహానికి నివాళులు

నరసాపురం: నరసాపురం పట్టణం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పట్టా సూర్యారావు(80) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని నరసాపురం పట్టణంలోని 26వ వార్డు వీవర్స్ కాలనీలో ఆయన స్వగృహంలో ఉంచారు. ఆయన మృతదేహాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, నాయకులు మంతెన కృష్ణ, పులపర్తి శ్రీధర్ శనివారం సందర్శించి నివాళులర్పించారు.

సైకిల్ స్టాండ్ ప్రారంభం

పెనుగొండ : మండలంలోని దేవ గ్రామంలో శ్రీమన్ని బుల్లి తిరుపతి రాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92లో పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో సైకిల్ షెడ్ నిర్మించారు. దీనిని శనివారం ఉదయం ప్రారంభించారు. దీనికి సుమారు రూ.80 వేలకు పైగా ఖర్చు అయినట్లు తెలియజేశారు. తాము చదివిన స్కూలుకు తమ వంతు సహకారం అందించాలని సంకల్పించిన పూర్వవిద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ ధన్యవాదాలు తెలియజేశారు. పూర్వవిద్యార్థులు మామిడిశెట్టి వివిఎస్.సత్యనారాయణ, జక్కం కెడివి.ప్రసాద్, బద్దా రమేష్ పాల్గొన్నారు.

మాంటిస్సోరి విద్యార్థులకు అవార్డులు

పాలకొల్లు రూరల్ : లిటిల్ ఛాంప్స్ ఎద్యు అకాడమీ హైదరాబాదు వారిచే అక్టోబర్ నెలలో నిర్వహించిన తెలుగు ఒలింపియాడ్‌లో ఉల్లంపర్రు మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు 10 లోపు 2 స్టేట్ ర్యాంకులు సాధించారు. వాసిరెడ్డి రోషిష్ణ స్టేట్ 3 ర్యాంక్, చవ్వాకుల జాహ్నవి సత్య దేవి స్టేట్ 7వ ర్యాంక్‌తో పాటు క్యాష్ అవార్డ్స్‌ను కూడా కైవసం చేసుకున్నారని ప్రిన్సిపల్ సామవేదం వసంతలక్ష్మి శనివారం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉల్లంపర్రు మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ అయినప్పటికీ విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిని తెలుగు ఒలింపియాడ్‌లో స్టేట్ ర్యాంకులు సాధించే విధంగా ప్రోత్సహించడం జరిగిందన్నారు. స్కూల్ అడ్మినిస్ట్రేటర్, డైరెక్టర్ మద్దాల వాసు, కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నరసాపురం: ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు తావుండదని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(పాలకొల్లు) ఎ.సత్యపవి తేజ అన్నారు. స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రహదారి భద్రతా నిబంధనలు, ప్రమాదాల నివారణ గురించి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు అతి వేగం ప్రమాదకరమన్నారు. వేగం కంటే ప్రాణం మిన్న అనే విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కెబి.సత్యనారాయణ, పాలకవర్గ సభ్యుడు అల్లూరి శ్రీహరి రహదారి భద్రత ప్రతిజ్ఞ చేశారు.

'రాజశేఖరంను గెలిపించాలి'

తాడేపల్లిగూడెం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రులతో భారీ ఎత్తున ఓట్లు వేయించి భారీ కూటమి నాయకులను తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని చిన్న తాడేపల్లి దొరల కళ్యాణమండపం వద్ద శనివారం ఎంఎల్‌సి ఎన్నికల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల మాదిరిగా కూటమి నాయకులందరం సమిష్టిగా ఎన్నికల్లో పాల్గొని కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలన్నారు.

నరసాపురం: కూటమి ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ శనివారం ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ప్రచారం చేశారు. ప్రచారంలో టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. శనివారం మండలంలోని సీతారామపురం సౌత్, నార్త్, రాజులంక తోటలో పట్టభద్రుల కరపత్రాలను పంపిణీ చేశారు.

గణపవరం : కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం గణపవరం జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.

డాక్టర్ మురళీ శ్రీనివాస్ రెడ్డి దంపతులకు సన్మానం

పెనుమంట్ర : మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ అధ్యక్షులు, జాతీయ, అంతర్జాతీయ అవార్డుల గ్రహీత, గౌరవ డాక్టరేట్ అందుకున్న శ్రీనివాస్ రెడ్డిను శనివారం పలువురు ఘనంగా సత్కరించారు. మండలంలోని నెగ్గిపూడి మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్వారంపూడి సాయి వీరేంద్ర రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ తరపున డాక్టర్ పాక రాజు, రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చదువుల వెంకట నరేంద్ర, డాక్టర్ నక్కా నరేష్ కుమార్ శ్రీనివాస్ రెడ్డి దంపతులను దుస్సాలువతో, పూలమాలతో సత్కరించి, శుభాకాంక్షలు చెప్పారు.

షాపుల్లో చోరీ

వీరవాసరం : నవుడూరులోని రెండు షాపుల్లో శనివారం తెల్లవారు జామున దొంగలు చొరబడి నగదు ఎత్తికెళ్లారు. బాధితులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం నవుడూరు-అండలూరు మార్గంలో బొట్టా శేఖర్‌కు చెందిన సత్య ఎలక్ట్రికల్ షాపులో రూ.25 వేలు, ఈశ్వర్‌కు చెందిన కూల్ డ్రింక్ షాపులో రూ.10 వేలను దొంగలు ఎత్తికెళ్లినట్లు తెలిపారు. ఈ రెండు షాపులలో ఒకే తరహాలో కిటికీలు తొలగించి దొంగలు షాపులోకి ప్రవేశించారు. ఈ దొంగతనాల విషయమై వీరవాసరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకతాయిలకు పోలీసుల కౌన్సెలింగ్

పెనుమంట్ర : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్టేరు సెంటర్లో శుక్రవారం ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా అర్థరాత్రి సమయంలో సరైన కారణం లేకుండా మోటార్ సైకిల్‌పై తిరుగుతూ, హారన్‌లను అధిక సౌండ్‌తో మోగిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై అటువంటి చర్యలు చేయరాదని హెచ్చరించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు

జిల్లా నెట్‌బాల్ కార్యదర్శి ఎన్‌వి.జయలక్ష్మి

భీమవరం : ఈనెల 16, 17 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలోని డాన్ బాస్కో హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో జరగనున్న 10వ జూనియర్ అండర్-19 బాల బాలికల రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా జట్టు పాల్గొననుందని జిల్లా నెట్ బాల్ కార్యదర్శి ఎన్.విజయలక్ష్మి తెలిపారు. అండర్-19 బాలుర జట్టులో 15 మంది, అండర్-19 బాలికల జట్టులో 15 మంది పాల్గొననున్నారని తెలిపారు. క్రీడాకారులు బాగా రాణించి, విజయంతో జిల్లాకు పేరు తేవాలని జిల్లా నెట్ బాల్ సంఘ సభ్యులు పి.దావూద్ ఖాన్, వి.వినీత్ జోసఫ్ కుమార్, జివిఎన్‌విఎస్.విజయ్ కుమార్, రామకృష్ణ, సుధీర్ అన్నారు.

అలెన్ కోచింగ్ సెంటర్ ప్రారంభం

భీమవరం టౌన్ : దేశంలోనే పేరొందిన అలెన్ విద్యాసంస్థలు భీమవరంలో ప్రారంభించడం గర్వకారణమని భీమవరం హాస్పిటల్ ఎండి డాక్టర్ గోపాల రాజు అన్నారు. శనివారం స్థానిక ఎఎస్‌ఆర్ నగర్‌లో నూతన అలెన్ బ్రాంచ్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అలెన్ విద్యాసంస్థ ఎంతోమంది డాక్టర్స్‌ని, ఇంజనీర్లను అందించిందన్నారు. భీమవరంలో నేటి నుంచి నీట్, ఐఐటి, జెఇ మెయిన్స్ హల్వెంట్ కోచింగ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ ఉభయ గోదావరి జిల్లాల వాసులకి అందుబాటులో ఉండటం శుభ పరిణామం అన్నారు. విద్యార్థులకు సంకిష్టమైన, న్యాయమైన ఒత్తిడి లేని విద్యను అలెన్ అందిస్తుందని తెలిపారు.

ఆలిండియా సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్‌కు సూర్యనారాయణ ఎంపిక

తణుకు : ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్‌లో జరిగే ఆలిండియా సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ జట్టుకు మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.మోహన్‌బాబు తెలిపారు. గతనెలలో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీలలో సూర్యనారాయణ 1500 మీటర్ల రన్నింగ్ విభాగంలో ఆయన ప్రథమ స్థానం సాధించినందుకు ఆయనను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. తమ పాఠశాలలో పనిచేసే టీచర్ వరుసగా రెండు సంవత్సరాల నుంచి(2024, 2025)లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవ్వడం పట్ల గ్రామ సర్పంచి జానా వెంకటలక్ష్మి, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మెన్ గూడూరి మహాలక్ష్మి, పాఠశాల సిబ్బంది సూర్యనారాయణను అభినందించారు.

మహాశివరాత్రికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు

భీమవరం : జిల్లాలోని ప్రముఖ శివాలయాల్లో మహాశివరాత్రికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సామాన్య యాత్రికులకు సైతం ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టరేటులో ఈనెల 26న మహా శివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ శివాలయాల్లో చేయవలసిన ఏర్పాట్లపై దేవాదాయ శాఖ, వివిధ శాఖల అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు సంయుక్తంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని అన్ని దేవాలయాలలో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో పాలకొల్లు, భీమవరం, నత్తా రామేశ్వరం, జుత్తిగ, ఆచంట, పెనుగొండ, లక్షణేశ్వరం, యనమదుర్రు, శివదేవుని చిక్కాల తొమ్మిది దేవాలయాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్యం నిర్వహణ, విద్యుత్ దీపాలు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, జనరేటర్లు, చలువ పందిర్లు, బ్యారికెట్లు, పార్కింగ్ ప్లేసు, క్యూలైన్ల ఏర్పాట్లు, గజఈత గాళ్లను, పోలీసు బందోబస్తు వంటి వాటిని వేగవంతంగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు మాట్లాడుతూ శ్రీమావుళ్లమ్మ ఉత్సవాలను కలిసికట్టుగా పనిచేసి విజయవంతంగా పూర్తిచేశారని, ఇదే స్ఫూర్తితో జిల్లాలో మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆధునిక టెక్నాలజీ సీసీ, సోలార్, డ్రోన్ కెమెరాలను వినియోగించాలన్నారు. 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పోలీసు బందోబస్తు ఎంతమంది కావాలన్నా ఇస్తామని, జిల్లాలో వార్డు, గ్రామ సచివాలయాల మహిళా పోలీసులను వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారి ఇవి.సుబ్బారావు, జిల్లా అగ్నిమాపకదళ అధికారి బి.శ్రీనివాసరావు, ఆర్‌బిఎస్ కెపిఒ డాక్టర్ సిహెచ్.భావన, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.సన్యాసిరావు, డిప్యూటీ తహాశీల్దారు ఇ.నాగార్జున, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వర రావు, దేవాలయాల కార్యనిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

'లోక్ అదాలత్‌తో డబ్బు, సమయం ఆదా'

ప్రజాశక్తి - తణుకు

లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులిద్దరికీ సత్వర పరిష్కారం లభిస్తుందని, తద్వారా విలువైన సమయం, డబ్బును ఆదా చేసుకోవాలని ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. శనివారం తణుకు కోర్టు ఆవరణలోని కోర్టు పరిధిలో పనిచేసే పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సత్యవతి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు పోలీసులు కృషి చేయాలన్నారు. కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించి ఇరుపక్షాలను రాజీ దిశగా తీసుకురావాలన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్కుబౌన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, ప్రామిశరీ నోటు కేసులు, సివిల్ కేసులు రాజీ చేసుకోవాలని కక్షిదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివిఎన్.రంజిత్‌కుమార్, బెంచ్ కోర్టు మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, స్పెషల్ కోర్టు జడ్జి పిఎస్‌పి.చిరంజీవిరావు, తణుకు టౌన్, తణుకు రూరల్, పెరవలి, ఇరగవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నరసాపురం: మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు సమన్యాయం అందించుటలో న్యాయవాదులు భాగస్వామ్యం కావాలని నరసాపురం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగరాజు అన్నారు. శనివారం న్యాయవాదులు కార్యవర్గం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. న్యాయవాదులు కూడా తమ తమ కక్షిదారులకు లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశంను వివరించాలన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గంగరాజు మాట్లాడుతూ రోజు కోర్టులో జరుగుతున్న మధ్యవర్తిత్వంను సద్వినియోగం చేసుకొని కక్షిదారులకు సమన్యాయం అందించుటకు న్యాయవాదులు పూర్తి సహకారాన్ని అందించాలని న్యాయవాదులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి బాలాజీ, కార్యదర్శి రంపా పుల్లాజి పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - పాలకోడేరు



పాలకోడేరు: మాట్లాడుతున్న సిడిపిఒ

ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా విస్తృత సేవలు అందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సిడిపిఒ వాణి విజయరత్నం తెలిపారు. పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న పోషణ్ బీ పడాయ్ బీ అంగన్వాడీ కార్యకర్తల శిక్షణా తరగతులు శనివారంతో ముగిసాయి. దీనిలో భాగంగా సిడిపిఒ వాణి విజయరత్నం శిక్షణ తరగతుల్లో పాల్గొని అంగన్వాడీలకు అనేక అంశాలపై శిక్షణ అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకివీడు ప్రాజెక్టు పరిధిలోని ఉండి, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు మండలాల పరిధిలో ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అంగన్వాడీ కార్యకర్తలకు పోషన్ బీ పడాయ్ బీపై శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజల్లోకి విస్తృతంగా చేరవేసే విధంగా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ జి.పార్వతి, సూర్యకుమారి పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : గత రెండు రోజుల నుంచి అంగన్వాడీ కార్యకర్తలకు స్థానిక చిన్నరంగడి పాలెం, వెంప గ్రామంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలు మూడవరోజు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చిన్న రంగపాలెం హైస్కూల్లో జరుగుతున్న కార్యక్రమంలో భీమవరం ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీకాంతం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు సకాలంలో అందించాలన్నారు. పౌష్టికాహార విలువలను గ్రామాల్లో వివరించాలని, వాటిపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని ఎంఇఒ ఆఫీసులో అంగన్వాడీల శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, ఇఒపిఆర్‌డి మూర్తి మాట్లాడారు. సూపర్వైజర్ ఎస్ఎన్.పద్మావతి, పులకండం సత్యవేణి పాల్గొన్నారు.

గణపవరం : ఈనెల 13 నుంచి 15 వరకు పిప్పర గణపవరం హైస్కూల్లో జరిగిన శిక్షణా అంగన్వాడీ శిక్షణా తరగతులు శనివారంతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ విల్సన్ బాబు, జి.చంద్రావతి, సిహెచ్.దుర్గాభవాని, ఎం.సుజాత పాల్గొన్నారు.

మొగల్తూరు : వికలాంగుల చిన్నారులను ఆదిలోనే గుర్తించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని సిడిపిఒ బి.ఊర్మిళ సూచించారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ సిబ్బందికి పోషన్ బీ పడాయి బీ కార్యక్రమంపై గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. సూపర్వైజర్ విజయ కుమారి, రమేష్ బాబు, గంగాధర్ అవగాహన కల్పించారు.

సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

భీమవరం : అధికారులకు నిర్దేశించిన లక్ష్యాలను సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని, సమస్యల పరిష్కారంలో ఎవరైనా అవినీతికి పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా అధికారులు మెప్పు కోసం కాకుండా ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే విధంగా సమస్యలు పరిష్కారం చూపాలన్నారు. శనివారం జిల్లా కలెక్టరేటులో 13 అంశాలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఖతీభ్ కౌసర్ భానో పాల్గొన్నారు.

50 మంది రోగులకు వైద్య పరీక్షలు

భీమవరం టౌన్ : అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవావిజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం దుర్గాపురంలో నిర్వహించిన మెడికల్ క్యాంపుకు సుమారుగా 50 మంది పేషెంట్లు వినియోగించుకున్నట్లు క్యాంపు నిర్వహకులు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఈ క్యాంపులో బిపి, షుగరు, బ్లడ్ టెస్టులు ఉచితంగా నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు.

మహారాజశ్రీ IX అడిషనల్ డిస్ట్రిక్టు జడ్జి, పశ్చిమగోదావరి జిల్లా, కొవ్వూరు వారి కోర్టులో

O.S.27/2016

1. శ్రీమతి రాకుర్తి వైజయంతి మాల, W/o. చక్రధరరావు Age 58 సం॥లు. D.No. 8-4-12, Doctor's Colony, Plot No. 3,విశాఖపట్టణం. విశాఖ జిల్లా, విశాఖపట్టణం, JCJC. ...వాది

AND

1. శ్రీ పెంటపాటి పుల్లారావు మరియు 10 వగైరాలు

D4. పెంటపాటి లలితాదేవి. D/o. లేటు వెంకటరమణ మూర్తి, Age 32 సం॥లు No Avocation R/o.పోలవరం(M) JRGJCJC ప॥గో॥ జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.

D7. Smt. Vemuri Jaya Lakshmi, W/o. Nageswara Rao, Age 65 years, Female, Employee, R/o. 4131, Rolling Meadwin, Ypsilanti, MICHIGAN - 48198, U.S.A.

...ప్రతివాదులు

పై నెంబరు దావాను వాది పార్టీషను నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు దావా నందు ప్రతివాదులు అయిన D4, D7 మీకు ఎన్నిమార్లు కోర్టు ద్వారాను మరియు Post ద్వారాను సమన్లు పంపించినప్పటికీ మీరు బుద్ధి పూర్వకముగా తీసుకొనకుండా Avoid చేయుచున్నందున శ్రీ కోర్టువారు ఉత్తర్వులు ప్రకారం సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా మీకు నోటీసులు అమలు పరచడమైనది. పై నెంబరు దావానందు మీకు ఏదైనా ఆక్షేపణలు వున్నయెడల మీరు ది. 25-02-2025 వ తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారాను గాని హజరై తెలియపరచుకొనవలెను. లేని యెడల దావా మీ పరోక్షమున తీర్మానించ బడును.

వాయిదా తేది : 25-02-2025

N.V.Subba Rao,
Advocate,
D.No.15-3-20, Bapuji Nagar,Kovvur,
Cell No.9440330449.

పలుచోట్ల 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్'



భీమవరం టౌన్: శుభ్రం చేస్తున్న ఎస్‌పి

భీమవరం టౌన్: రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి శనివారం ఎస్‌పి కార్యాలయ ఆవరణలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా చాలా వరకు అనారోగ్యాలు మనదరి చేరకుండా చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డిఎస్‌పి ఎంవివి.సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు పాల్గొన్నారు.

గణపవరం : స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యర్థ పదార్థాల ద్వారా ఆర్గానిక్ కంపోస్టు ఎలా చేయాలి అనేదానిపై డాక్టర్ కిరణ్మయి వివరించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవటం వల్ల ఎలాంటి వ్యాధులు దరిచేరవని అన్నారు. ఇంటి వద్ద నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆకివీడు : ప్రభుత్వ కార్యాలయాలలో పరిశుభ్రత పాటించాలని, అందుకు ప్రతి ఒక్కరూ మూడవ శనివారం నాడు విధిగా కార్యాలయాలు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టాలని తహాశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశుభ్రతలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలోని పిచ్చి మొక్కలు, చెత్త తొలగించే కార్యక్రమం శనివారం చేపట్టారు. నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో కార్యాలయ సిబ్బంది స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.

తాడేపల్లిగూడెం: ప్రతి నెలలో ఒక రోజు మన పరిసరాల కోసం శ్రమదానం చేయాలని ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ పేర్కొన్నారు. నవాబుపాలెం, కృష్ణయ్యపాలెం గ్రామాల్లో మూడో శనివారం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణయ్యపాలెంలో జిల్లా పరిషత్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇఒపిఆర్‌డి ఎం.వెంకటేష్ ఆధ్వర్యంలో నవాబ్ పాలెం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే పద్ధతిని వివరించారు. అనంతరం గ్రామస్తులతో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు వై.హరి కిషోర్, మహమ్మద్, ఎంఆర్‌సిఎం రవి కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇ.స్వరాజ్యలక్ష్మి, సిబ్బంది ఎక్సైజ్ స్టేషన్ లోపల, పరిసరాలను శుభ్రపరచుకుని స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ బాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అధికారులు, సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురం విద్యుత్ శాఖ ఇఇ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు, సిబ్బంది కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఇఇ కె.మధు కుమార్ సిబ్బందితో ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఎడిఎ ఓంకారం, ఎఇ ప్రభాకర్ పాల్గొన్నారు. నరసాపురం గృహ నిర్మాణ సంస్థ డివిజన్ కార్యాలయంలో కూడా నిర్వహించారు. హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసరావు, డిఇ వెంకటేశ్వరరావు, ఎఇలు రవీంద్ర, నరేష్ పాల్గొన్నారు.

నరసాపురం: నరసాపురం పట్టణంలోని బస్‌స్టాండ్ వద్ద శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పాల్గొన్నారు. బస్‌స్టాండ్ సెంటర్ నుంచి గాంధీ విగ్రహం వద్ద వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు.

పెనుగొండ : స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఆధ్వర్యాన మొక్కలు నాటుట, పరిసరాల పరిశుభ్రత పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాధికారి డి.శుభాకరరావు, మండల పరిషత్ ఎస్.రమేష్, ఎ.వేణుగోపాల రావు పాల్గొన్నారు.

తణుకు : పరిసరాల పరిశుభ్రత పాటించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తణుకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ ఆసుపత్రి సిబ్బందిని, ప్రజలను కోరారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఎస్‌విఆర్.రాజేశ్వరి, డాక్టర్ ఎస్‌కె.షాకీలబేగం, డాక్టర్ కీర్తి పాల్గొన్నారు.

నరసాపురం: నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆధ్వర్యంలో కార్యాలయ పరిసరాలను శుభ్ర పరిచారు. ఆర్‌డిఒ దాసిరాజు స్వయంగా చీపురు పట్టి సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.

ఉండి: ఉండి గవర్నమెంట్ ఐటిఐ కాలేజ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఉండి రైల్వే స్టేషన్, ఉండి పోలీస్ స్టేషన్ పరిసరాలను పోలీస్ సిబ్బంది, ఐటిఐ కాలేజ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఐటిఐ కాలేజ్ ప్రధాన అధికారి వేగేశ్న శ్రీనివాసరాజు, ఉండి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల్లో చెత్త తొలగించి శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ ఆవరణ ప్రధాన రహదారులు తదితర ప్రాంతాల్లో చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM- III ADDL. DISTRICT JUDGE, R.R. DISTRICT :: AT L.B. NAGAR

O.S.NO. 10 OF 2022

BETWEEN:
Pandipati Laxman
@ Pandiyabatta Laxman ... Petitioner
AND
Mathukumalli Suvarchaladevi and others ... Respondents

To,
1. Mathukumalli Suvarchaladevi, D/o Raghunadha Babu Aged: Major, Occupation : Owner of the Vehicle R/o. D.No. 17-4-16/3, Guntur Road, Narsaraopeta, Guntur District 522601.
2. T. Sai Pavan Kumar, S/o Srinivasa Rao Aged: 25 years, Occupation : Driver of the Vehicle R/o H.No.2-84/1, China Ayyappa Nagar, Dodipatla Yelamanchili, Yelamanchili, West Godavari Dt. - 534266

....Respondent Nos. 1 to 2

NOTICE

Please take notice that the Petitioner filed the above petition under M.V. Act Claiming Compensation and the Hon'ble Court was pleased In to post at the same on 27-02-2025 at 10:30 a.m for your appearance. inspite of this clear notice, if you failed to appear before the Hon'ble Court, the matter will be decided in your absence. Hence, this Notice

(BY ORDER OF THE COURT)

V. THRIMURTHULU,
Advocate.
Office Chambers: #2-2-90/16, S. No. 9, Srinath Enclave, Amberpet, Hyderabad - 500 013.
Cell No. 9246165838

ఉపకారాగారం సందర్శన

నరసాపురం: ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ నరసాపురం ఉప కారాగారాన్ని పర్యవేక్షించారు. నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు తదితర విషయాలను ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాదారులు జైల్ ముద్దాయిలకు అందించే న్యాయ సహాయంపై ఆరా తీశారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, పర్యవేక్షణాధికారి పాల్గొన్నారు.

పేరు మార్పు / సవరణ

నేను కాళే సూర్యకుమారి W/o కాళే వెంకటేశ్వరరావు, నివాసం : డోర్ నెం.22-17-18, శివాలయం వీధి, సజ్జాపురం, తణుకు.

నా యొక్క పూర్వపు పేరు **కాళే సూర్యకుమారి W/o కాళే వెంకటేశ్వరరావు** ఇప్పుడు కొత్తగా పేరు మార్పు/ సవరణ చేయగా **యండమూరి సూర్యకుమారి** W/o **యండమూరి నారాయణరావు** అని మార్చబడినది. నేటి నుండి నా పేరును **(YANDAMURI SURYAKUMARI W/o YANDAMURI NARAYANA RAO)** అని పిలువబడును.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుగొండ మండలం, రామన్నపాలెం గ్రామానికి చెందిన యర్రంశెట్టి దుర్గారావు, తండ్రి: చిన్న సుబ్బరాజు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. అద్దె ఇంటి నుండి ఇంకో అద్దె ఇంటికి మారినప్పుడు నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. నా యొక్క **పాస్పోర్ట్ నెం. K7116416** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

యర్రంశెట్టి దుర్గారావు
తండ్రి : చిన్న సుబ్బరాజు
డోర్ నెం : 2-112
యర్రంశెట్టి వారి పాలెం, రామన్నపాలెం, పెనుగొండ మండలం, ప.గో.జిల్లా
సెల్: 8989292957

PUBLIC NOTICE

Under the instruction of my client M/S Shriram Finance Ltd. Aswaraopeta Branch Rep. by its Branch Manager it is stated that Smt. Jadu Krishna Kumari, w/o Gowri Sankar, 31 years, occ: Business, R/o Ganijerla village, Chinthalapudi Mandal, Eluru District. is creating mortgage against her property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client within 5 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SHEDULE OF THE PROPERTY

Vacant house place of an extent of 242 Sq. yards or Ac. 0.05 cents in R.S.No. 183, from and out of Ac. 3-82 cents situated at Ganijerla village; Chinthalapudi Mandal, Eluru District bounded by:
EAST : Panchayath CC Road
SOUTH : Panchayat Road
WEST : Place of Sola Srinu
NORTH : Palce of Telagarapu Krishnaiah

P.GANESH BABU
Kothagudem Advocate
Dt: 15-02-2025 Kothagudem
Cell:98492 46278

In The Court Of The 2nd Add Junior Civil Judge W.G.Dt, Eluru
I.A.No. 213/2023 in O.S.No. 493/2023

Between:
Majji Rajendra Kumar and Other's ... **Petitioner/*Plaintiff***
and
Kalindi Vishnu Varma and Another ... **Respondent/*Defendants***

R1:- Kalidindi Vishnu Varma S/o. Kalidindi Venkata Narasimha Raju, Business R/o.H.No. 2-174, Thotula palli Village,Nidamarru Mandal, W.G.Dt. Tadepalligudem.

కోర్టు ప్రకటన

పై నంబరు గల దావాలో 1st Respondent గారికి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపిన పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం పేపర్ పబ్లికేషన్‌కి ఆర్డర్ వేసియున్నారు. కావున పై వారికి ఏమైన ఆక్షేపణలు ఉన్న యడల పై కోర్టు ఎదుట **ది.12-03-2025వ తేదీకి ఉదయం గం. 10-30 ని.లకు** హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పవలెను.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

Sri Nekkaraganti Narasimha Rao
Advocate
Eluru Eluru, Eluru.Dt
Date: 15-02-2025 Cell: 98481 18984

In The Court Of The 2nd Add Junior Civil Judge W.G.Dt, Eluru
O.S.No. 493/2023

Between:
Majji Rajendra Kumar and Other's ... ***Plaintiff***
and
Kalindi Vishnu Varma and Another ... ***Defendants***

R1:- Kalidindi Vishnu Varma S/o. Kalidindi Venkata Narasimha Raju, Business R/o.H.No. 2-174, Thotula palli Village,Nidamarru Mandal, W.G.Dt. Tadepalligudem.

కోర్టు ప్రకటన

పై నంబరు గల దావాలో 1st Defendant గారికి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపిన పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం పేపర్ పబ్లికేషన్‌కి ఆర్డర్ వేసియున్నారు. కావున పై వారికి ఏమైన ఆక్షేపణలు ఉన్న యడల పై కోర్టు ఎదుట **ది.12-03-2025వ తేదీకి ఉదయం గం. 10-30 ని.లకు** హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పవలెను.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

Sri Nekkaraganti Narasimha Rao
Advocate
Eluru Eluru, Eluru.Dt
Date: 15-02-2025 Cell: 98481 18984